

దారులకు మంచి రోజులు

గ్రామీణ రోడ్లకు మహర్దశ కలుగనుంది. బీటీ రోడ్లుగా మార్చేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. 8లో▸



కాంగ్రెస్‌తోనే న్యాయం

కాంగ్రెస్ పార్టీ పాలనలోనే ప్రజలకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. 8లో▸



పూలే విగ్రహావిష్కరణ

శేరిగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సావిత్రి బాయి పూలే విగ్రహాన్ని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆవిష్కరించారు. 8లో▸

న్యూస్‌రీల్

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో భేటీ



శాంతికుమారిని కలిసిన వెంకటేశ్ తదితరులు

తలకొండపల్లి: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని మిషన్ భగీరథ కార్పొరేషన్ రాష్ట్ర వైస్ చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి.. ఆమెను సత్కరించారు. అనంతరం శాంతికుమారి వెంకటేశ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట ఎంపీపీ తిర్మణి నిర్మల, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు గోపాల్‌నాయక్ ఉన్నారు.

బైక్ రైడింగ్‌పై మహిళలకు శిక్షణ



బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని గుర్రంగూడ హాస్టెన్ గోకార్టింగ్‌లో బైక్ రైడింగ్‌పై మహిళలకు ఆదివారం శిక్షణ నిర్వహించారు. ఇప్పటికే 200 మంది మహిళలకు పూర్తి శిక్షణ అందించామని, ఐదో విడతలో భాగంగా మరో 50 మందికి శిక్షణ ఇవ్వనున్నట్టు ఆర్‌బీ సహవ్యవస్థాపకుడు, సీఈవో అభిషేక్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. మహిళా సాధికారతపై దృష్టి సారించి మోటార్ సైకిళ్ల శిక్షణ ప్రారంభించినట్టు నిర్వాహకులు తెలిపారు.

20 కిలోల గంజాయి పట్టివేత



స్వాధీనం చేసుకున్న గంజాయితో నిందితులు

మంచాల: ఇరవై కిలోల పొడి గంజాయిను పోలీసులు పట్టుకున్న సంఘటన మండల పరిధిలోని ఆగాపల్లి గ్రామం వద్ద ఆదివారం చోటు చేసుకుంది. సీఐ కాశీవిశ్వనాథ్ కథనం ప్రకారం.. ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి, కూర్మనూర్ గ్రామాల నుంచి కొంతమంది హైదరాబాద్‌కు బస్సులో గంజాయి రవాణా చేస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు మహేశ్వర జోన్ ఎస్‌ఓటీ పోలీసులు, మంచాల పోలీసు సిబ్బంది కలిసి ఆగాపల్లి వద్ద ఓ ప్రైవేట్ బస్సును తనిఖీ చేశారు. గంజాయి తరలిస్తున్న మహారాష్ట్రకు చెందిన సచిన్ సంతోష్ జాదవ్ (22), శరత్ భరత్ పవార్ (19), జోయల్ అనే బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 2 కిలోల పొడి గంజాయి ప్యాకెట్లు 5, ఐదుకిలోల పొడి గంజాయి ప్యాకెట్లు 2 చొప్పున 20 కిలోల గంజాయి పట్టుకున్నారు. వారి నుంచి రూ.1000 స్వాధీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకున్న వారిని విచారించగా మరో ఇద్దరి పేర్లు వెల్లడించారు. వారిలో మహారాష్ట్రకు చెందిన రాహుల్ ఖరత్, ఒడిశా రాష్ట్రానికి చెందిన ఉమేష్ సునా ఉన్నారు. వీరందరిపై కేసులు నమోదు చేశారు.

క్షుద్ర పూజల కోసం కస్తూరి పిల్లి అవయవాల తరలింపు

శంషాబాద్: క్షుద్రపూజల కోసం కస్తూరి పిల్లికి సంబంధించిన అవయవాలను తరలిస్తున్న వ్యక్తిని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో సీఐఎస్‌ఎఫ్ అధికారులు అదుపులోకి తీసుకుని అటవీశాఖ అధికారులకు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఆదివారం తెల్లవారు జామున సయ్యద్ అక్బర్ పాషా అనే వ్యక్తి ముంబై వెళ్లేందుకు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చాడు. లగేజీ స్క్రీనింగ్‌లో అనుమానిత వస్తువులు కనిపించడంతో సీఐఎస్‌ఎఫ్ అధికారులు వాటిని విప్పి చూడగా, కస్తూరి పిల్లికి సంబంధించిన అవయవాలు ఉన్నట్లు గుర్తించారు. దీంతో అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా క్షుద్ర పూజల కోసం వాటిని తీసుకెళ్తున్నట్లు తెలిపారు. కస్టమ్స్ అధికారులు అతడిని అటవీ శాఖ అధికారులకు అప్పగించడంతో వారు అతడిపై వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే అతడు వీటిని ఎక్కడి నుంచి తీసుకొచ్చాడనే దానిపై దర్యాప్తు చేపట్టారు. కస్తూరి పిల్లి శేషాచలం అటవీ ప్రాంతంతో పాటు హిమాచల్ ప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, టిబెట్ ప్రాంతాల్లో మాత్రమే ఉంటాయని అధికారులు పేర్కొన్నారు. కస్తూరి పిల్ల అవయవాలను సుగంధ పరిమళాల ఉత్పత్తుల తయారీలో.. కొన్ని రకాల ఔషధాల్లో వినియోగిస్తున్నట్లు తెలిసింది.

చందనవెల్లి.. కల్పవల్లి

పారిశ్రామిక హబ్‌గా మారుతున్న గ్రామం

- ఐదేళ్లలోనే రూ.13,508 కోట్ల పెట్టుబడులు
- 45 పరిశ్రమల స్థాపన.. 3,210 మందికి ఉద్యోగావకాశాలు
- కొలువుదీరిన వెల్‌స్పన్, అమేజాన్, మైక్రోసాఫ్ట్, సింటెక్స్, ఒలెక్ట్రాగ్రీన్‌టెక్ వంటి మెగా సంస్థలు
- రూ.1,362 కోట్ల పెట్టుబడులతో విస్తరించిన మరో 45 కంపెనీలు
- తెలంగాణకే తలమానికంగా ఇండస్ట్రియల్ పార్కు



చందనవెల్లిలో ఏర్పాటు చేసిన వెల్‌స్పన్ పరిశ్రమ

షాబాద్: ఒకప్పుడు కుగ్రామంగా ఉన్న మండలంలోని చందనవెల్లి వరుసగా పరిశ్రమల రాకతో పారిశ్రామిక హబ్‌గా రూపాంతరం చెందింది. ఇండస్ట్రియల్ పార్కుతో రాష్ట్రానికే తలమానికంగా మారుతోంది. కేవలం ఐదేళ్లలో రూ.13,508 కోట్ల పెట్టుబడులతో 45 పరిశ్రమలు కొలువుదీరగా, 3,210 మందికి ఉద్యోగావకాశాలు దక్కడం విశేషం. రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక రంగంలో తెచ్చిన మార్పులతో చందనవెల్లి ప్రాంతం ముఖ చిత్రం పూర్తిగా మారిపోయింది. పరిశ్రమలను ఏర్పాటు చేయాలంటే పారిశ్రామికవేత్తలు ఇటువైపే చూస్తున్నారు. ఐటీ కారిడార్‌కు చేరువగా ఉండడం.. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి అరగంటలోనే చేరుకునే సదుపాయం వంటి అనేక అనుకూల పరిస్థితులు ఉండడంతో చాలా కంపెనీలు ఇక్కడ తమ శాఖల ఏర్పాటుకు ముందుకు వస్తున్నాయి.



చందనవెల్లిలో ఏర్పాటు చేసిన టెక్స్‌టైల్ పార్కు

ప్రభుత్వ సహకారంతో..

ఇక్కడ ఇండస్ట్రియల్ పార్కు అభివృద్ధి కోసం ప్రభుత్వం 2,060.34 ఎకరాలు కేటాయించింది. 799 ఎకరాల్లో 194 ప్లాట్లు చేసి విడతల వారీగా కంపెనీలకు కేటాయిస్తోంది. ఇప్పటివరకు 103 కంపెనీలకు ప్లాట్లను కేటాయించింది. వెల్‌స్పన్, అమేజాన్, మైక్రోసాఫ్ట్, ఒలెక్ట్రా గ్రీన్‌టెక్, సింటెక్స్ వంటి ఎన్నో కార్పొరేట్ సంస్థలు ఏర్పాటయ్యాయి. కొన్ని కంపెనీలు ఇప్పటికే ఉత్పత్తులను సైతం ప్రారంభించగా.. మరికొన్ని పనులు తుది దశకు చేరుకున్నాయి. స్థానికంగా ఉన్న ఐటీఐని దత్తత తీసుకుని స్థానికులకు శిక్షణ ఇచ్చి తమ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని త్వరలో ఏర్పాటు కానున్న జపాన్‌కు చెందిన కంపెనీలు ప్రకటించాయి. ఇదే బాటలో మరికొన్ని కంపెనీలు అనుసరిస్తున్నాయి.

స్థానికులకు ఉపాధి అవకాశాలు

చేవెళ్ల పట్టణ కేంద్రానికి 10 నుంచి 12 కి.మీ. దూరంలో ఉన్న చందనవెల్లి భారీ పరిశ్రమలకు నెలవుగా మారింది. ఇక్కడ ఇండస్ట్రియల్ పార్కు అభివృద్ధి కోసం ప్రభుత్వం 2,060.34 ఎకరాలను కేటాయించింది. 1,569.89 ఎకరాల్లో భూసేకరణ ప్రక్రియ పూర్తయింది. ఈ మేరకు టీఎస్ఐఐసీ లేఅవుట్ చేసి 799 ఎకరాల్లో 194 ప్లాట్లు చేసి విడతల వారీగా కంపెనీలకు ప్లాట్లను కేటాయిస్తూ వస్తోంది. చందనవెల్లితో పాటు చేవెళ్ల, మొయినాబాద్, షాబాద్, శంకర్‌పల్లి మండలాలకు పరిశ్రమలు క్యూ కడుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో రూ.14,870 కోట్ల పెట్టుబడులతో 84 పరిశ్రమలు కొలువుదీరాయి. ఆయా పరిశ్రమల యాజమాన్యాలు స్థానికులకే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాయి. దీంతో స్థానిక నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధి అవకాశాలు



చందనవెల్లి, సీతారాంపూర్, హైతాబాద్, మాచన్‌పల్లి, సీతారాంపూర్‌లో ఏర్పాటైన ఎలక్ట్రికల్ కార్ల కంపెనీ, వెల్‌స్పన్, అమేజాన్, కతారే, కుందన్, టెక్స్‌టైల్స్ పరిశ్రమలు చాలా వచ్చాయి. ఆయా పరిశ్రమల్లో స్థానిక యువతకు తగిన ప్రాధాన్యం కల్పించాలి. ఇప్పటికే వేల సంఖ్యలో నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రావడం సంతోషంగా ఉంది.

– కొట్ల ప్రశాంతిరెడ్డి, ఎంపీపీ, షాబాద్

రూపురేఖలు మారుతున్నాయి



చందనవెల్లి, సీతారాంపూర్ గ్రామాల రూపురేఖలు మారిపోతున్నాయి. చందనవెల్లి–హైతాబాద్ పరిసరాల్లో పరిశ్రమల రాకతో ఇక్కడి భూములకు రెక్కలొచ్చాయి. గతంలో ఎకరం భూమి రూ.10లక్షల నుంచి రూ.20లక్షల వరకు పలికేది. ప్రస్తుతం పరిశ్రమల రాకతో రూ.3 కోట్లకుపైగా అమ్ముడుపోతోంది.

– గూడూరు నర్సింగ్‌రావు, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్

బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ ఖాయం

మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం: ప్రతి పక్షాలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా రాష్ట్రంలో మూడోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని తుమ్మలూరు, గంగారం, రామచంద్రగూడ, పెండ్యాల, కల్వకోల్, దుబ్బచర్ల, దిలావార్‌గూడ, పోరండ్ల, నాగిరెడ్డిపల్లి, నాగిరెడ్డిపల్లి తండాల్లో సుమారు రూ.19.62 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఆదివారం జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తాతో కలిసి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అన్ని వర్గాల ప్రజల ఆశీర్వాదం బీఆర్‌ఎస్‌కే ఉందన్నారు. ఏ రాష్ట్రంలో చేయనటువంటి అభివృద్ధి, సంక్షేమ పథకాలు సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీపీ సునితా నాయక్, కందుకూకు జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ ఎస్.ఆనందం, పీఏసీఎస్ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మార్కెట్ కమిటీ, పీఏసీఎస్ డైరెక్టర్లు, తహసీల్దార్ మహమూద్ అలీ, ఎంపీడీఓ నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజారంజక పాలన

కందుకూరు: తెలంగాణలో అన్ని కులాలు, మతాలకు ఆత్మగౌరవం కలిగేలా సీఎం కేసీఆర్ పాలన ఉందని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి కొనియాడారు. మండల పరిధిలోని సార్లరావులపల్లిలో రూ.20 లక్షలతో నిర్మించిన నూతన పంచాయతీ భవనం, రూ.30 లక్షలతో నిర్మించిన ఫంక్షన్‌హాల్‌ను ఆదివారం మంత్రి ప్రారంభించారు. రూ.2.43 కోట్లతో సార్లరావులపల్లి నుంచి పోచమ్మతండా వరకు నిర్మించనున్న బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సమాజంలో మార్పు కోసం సీఎం ఎంతో కృషి చేస్తున్నారన్నారు. గిరిజనులకు పది శాతం రిజర్వేషన్లు కల్పించారని, వారి ఆత్మగౌవానికి బంజారాహిల్స్‌లో బంజారా భవనాన్ని నిర్మించి ఇచ్చారన్నారు. నేత కార్మికుల ఆత్మహత్యలు నివారించేలా బతుకమ్మ చీరల తయారీతో వారికి ఆర్థికంగా భరోసా కల్పిస్తున్నారన్నారు. నేతన్నల శ్రమ, కేసీఆర్ ప్రేమను బతుకమ్మ చీరల్లో చూడాలన్నారు. మిషన్‌భగీరథ, రైతుబంధు, కల్యాణలక్ష్మి వంటి ఎన్నో సంక్షేమ పథకాల అమలుతో ప్రజారంజక పాలన కొనసాగిస్తున్నారన్నారు. రైతులకు 24 గంటల విద్యుత్ ఇస్తుంటే రేవంత్‌రెడ్డి మూడు గంటలు చాలంటున్నారని ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్‌కే ఓటు వేసి మరోసారి అధికారంలోకి వచ్చేలా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ రజిత ప్రవీణ్‌నాయక్, ఎంపీటీసీ బక్క మల్లేష్, ఎంపీపీ మంద జ్యోతి, జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, వైస్ ఎంపీపీ జి.శమంత, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, బీఆర్‌ఎస్ మండల మహిళా అధ్యక్షురాలు ఇందిర పాల్గొన్నారు.



మహేశ్వరం: తుమ్మలూరు మ్యాక్ ప్రాజెక్టులో 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సబితారెడ్డి, చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా తదితరులు

ట్రిబ్యునల్–2 ఏర్పాటు హర్షణీయం



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్కా నర్సింహారెడ్డి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్కా నర్సింహారెడ్డి

మహేశ్వరం: కృష్ణా నదీ జలాల్లో తెలంగాణ వాటా తేల్చేందుకు కేంద్ర ప్రభుత్వం ట్రిబ్యునల్–2 ఏర్పాటు చేయడం హర్షణీయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్కా నర్సింహారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం పార్టీ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కృష్ణా నదీ జలాల వాటాలో తెలంగాణకు 590 టీఎంసీల నీరు రావాలని.. కానీ సీఎం కేసీఆర్ సీమాంధ్ర వారితో కుమ్మక్కై 257 టీఎంసీలకే ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు. దక్షిణ తెలంగాణను ఎడారిగా మార్చే కుట్ర చేస్తున్నారన్నారు. మేరీ మిట్టి–మేరీ దేశ్ కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామం నుంచి మట్టిని తీసుకొచ్చి దేశం కోసం ప్రాణాలర్పించిన అమర జవాన్ల స్మారక స్థూపం నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. బూత్ కమిటీ అధ్యక్షులు బాధ్యతగా తీసుకొని గ్రామాల్లో మట్టిని సేకరించాలన్నారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు బస్వ పాపయ్య గౌడ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మిద్దె సుదర్శన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి యాదయ్య గౌడ్, గిరిజన రాష్ట్ర నాయకులు పంతు నాయక్, దేశ్యా నాయక్, సెన్సార్ బోర్డు మాజీ సభ్యుడు అనంతయ్య గౌడ్ పాల్గొన్నారు.

యువత చేతిలో దేశ భవిత



బీజేపీలో చేరిన యువకులు

పాలమూరు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పాలమూరు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని దూసకల్ గ్రామానికి చెందిన పలువురు యువకులు విష్ణువర్ధన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా పట్టణంలోని బాలాజీటౌన్ షిప్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని అన్నారు. యువకులు సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ అన్ని వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి వివరించాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు మోహన్ సింగ్, లష్కర్ నాయక్, వెంకట్‌రెడ్డి, సుధాకర్, అప్ప, శ్యాంసుందర్‌రెడ్డి, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

దేశం చూపు తెలంగాణ వైపు

- అభివృద్ధిలో ఆదర్శంగా రాష్ట్రం
- మంత్రి పట్నం మహేందర్ రెడ్డి



చేవెళ్ల: మల్కాపూర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ, ఎమ్మెల్యే తదితరులు

చేవెళ్ల: దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తోందని.. ప్రజలు కాంగ్రెస్, బీజేపీ చెప్పే కట్టుకథలను నమ్మొద్దని గనులు, భూగర్భవనరులు, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. మండలంలో ఆదివారం ఎంపీ రంజిత్ రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డితో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గతంలో ఏ ప్రభుత్వంలో జరగని అభివృద్ధి తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత జరిగినట్లు ప్రతి ఒక్కరికీ స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. బీఆర్‌ఎస్ పథకాలను ప్రతిపక్షాలు కాపీ కొడుతున్నాయని, ప్రజలు గమనించాలన్నారు. మళ్లీ బీఆర్‌ఎస్ పార్టీని ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ పి.కృష్ణారెడ్డి, ఎంపీపీ ఎం.విజయలక్ష్మి, జెడ్పీటీసీ ఎం.మాలతి, సర్పంచ్ శైలజ, పలువురు ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, ఇరిగేషన్ ఈఈ రేణుక, ఏడీ వెంకటరమణ, ఎంపీ డీఓ హిమబిందు, తహసీల్దార్ కృష్ణయ్య పాల్గొన్నారు.

మల్కాపూర్‌లో ఘర్షణ

మండలంలోని మల్కాపూర్‌లో గ్రామానికి చెందిన గండు రవి తనకు దివ్యాంగుల పింఛన్ రావడం లేదని ఎంపీ, మంత్రికి చెప్పేందుకు ముందుకు వచ్చాడు. ఒకేపార్టీకి చెందిన వారే అయినప్పటికీ వేరే వర్గం వారు కావటంతో సభలో గొడవ చేయడానికే వస్తున్నారని సర్పంచ్ వర్గం వారు అడ్డుకున్నారు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఒకరినొకరు కొట్టుకునే వరకు వెళ్లింది. అక్కడే ఉన్న పోలీసులు ఇరువురికీ నచ్చజెప్పి అక్కడి నుంచి పంపించారు.

పథకాల అమలులో టాప్

మొయినాబాద్: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం హ్యాట్రిక్ కొట్టబోతుందని.. కేసీఆర్ మూడోసారి సీఎం అవుతారని మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని సురంగల్‌లో రూ.25 లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి ప్రారంభించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించడంతోపాటు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం అగ్రస్థానంలో ఉందన్నారు. ఎంపీ రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అందరికీ అందుతున్నాయన్నారు. ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ.. సీతారాంపూర్, చందన్‌వెల్లి పారిశ్రామికవాడలో నియోజవర్గంలోని 35 వేల మంది మహిళలకు ఉపాధి లభించనుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నక్షత్రం, జెడ్పీటీసీ శ్రీకాంత్, ఏఎంసీ వైస్ చైర్మన్ రవూఫ్, సర్పంచ్‌లు గడ్డం లావణ్య, కోట్ల నరోత్తంరెడ్డి, కుమార్, ఎంపీటీసీలు పద్మమ్మ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ది సంక్షేమ పాలన

మొయినాబాద్‌రూరల్: సీఎం కేసీఆర్‌ది సంక్షేమ పాలన అని మంత్రి మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లిలో ఆదివారం ఉచిత వైద్య ఆరోగ్య రథాన్ని ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, సర్పంచ్ శోభతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేద విద్యార్థులు చదువుతున్న గురుకుల సంక్షేమ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంతో పాటు ఉపాహార పథకాన్ని కల్పించడం అభినందనీయమన్నారు. ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. వైద్య, విద్యా రంగాల్లో తెలంగాణ దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిచిందన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శోభ, ఎంపీపీ నక్షత్రంజేవంతు, జెడ్పీటీసీ కాలె శ్రీకాంత్, పంచాయతీరాజ్ ఏఈ రమ్య, వెంకటాపూర్ సర్పంచ్ మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణపై ఒత్తిడి తేవాలి



మాదిగల యుద్ధభేరి కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టేలా అన్ని రాజకీయ పార్టీలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి హరిబాబు అన్నారు. నవంబర్ 23న నిర్వహించనున్న మాదిగల యుద్ధభేరి కరపత్రాన్ని ఆదివారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనాభా దామాషా ప్రకారం మాదిగలకు సీట్లు కేటాయించాలని అన్నారు. సామాజిక నిర్మాణంలో, ఉత్పత్తిలో వారి పాత్ర విస్మరించలేనిదన్నారు. వేల సంవత్సరాలుగా విద్యకు, రాజ్యాధికారానికి, సంపదకు, సామాజిక గౌరవానికి మాదిగలు దూరంగా ఉన్నారని తెలిపారు. చెప్పు, డప్పులకు పెన్షన్ ఇస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీ సమావేశాల్లో హామీ ఇచ్చి పదేళ్లు గడుస్తున్నా మాట నిలబెట్టుకోలేదని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రామకృష్ణ, వెంకటేశ్, విక్రం, వీరయ్య, లింగం తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో ప్రగతి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న అంజయ్య యాదవ్

- గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట
- జాతీయ స్థాయిలో జీపీలకు అవార్డులు
- మరోసారి బీఆర్ఎస్‌ను ఆశీర్వదించండి
- ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్: బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక పల్లెలు అన్ని రంగాల్లో గణనీయమైన ప్రగతి సాధిస్తున్నాయని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. మండల పరిధిలోని దూసకల్ గ్రామంలో రూ.20లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్లు, రూ.7.50లక్షలతో నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆదివారం శంకుస్థాపనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో గ్రామ పంచాయితీలు అభివృద్ధిలో పోటీ పడి అవార్డులు సొంతం చేసుకుంటున్నాయని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు. పల్లెల రూపు రేఖలను మార్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ తెలంగాణలో సంక్షేమ పథకాలను చేపడుతున్నారని, అందువల్ల అభివృద్ధిలో రాష్ట్రం నంబర్ వన్ స్థానంలో నిలిచిందని అన్నారు. గ్రామ పాలనను పటిష్టం చేసేందుకు ప్రభుత్వం నూతన పంచాయితీరాజ్ చట్టాన్ని తీసుకొచ్చిందని గుర్తుచేశారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని మరోసారి ఆశీర్వదించాలని కోరారు.

బీఆర్ఎస్‌లో చేరిక

మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామానికి చెందిన బీజేపీ నేత ప్రకాష్‌చారి అంజయ్య యాదవ్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. జెడ్పీ వైస్ చైర్మన్ గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడులు అరికట్టాలి



కేవీపీఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న చెన్నయ్య

తలకొండపల్లి: దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నయ్య డిమాండ్ చేశారు. దళితహక్కులు, చట్టాలు సాధించడం కోసం కేవీపీఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అనేక ఉద్యమాలు చేశామని గుర్తు చేశారు. కేవీపీఎస్ 25 సంవత్సరాల వారోత్సవాల్లో భాగంగా చౌదర్‌పల్లిలో ఆదివారం కేవీపీఎస్ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ దళితుల సబ్‌ప్లాన్ చట్టం, స్మశాన వాటికలు, గృహ అవసరాల విద్యుత్ వినియోగం 101 యూనిట్ల చట్టాలను సాధించామని పేర్కొన్నారు. అర్హులైన దళితులకు డబల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు అనిల్, శ్రీశైలం, విష్ణు, నాగర్జున, మల్లేశ్, నరేశ్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

శంకర్‌పల్లి: బైక్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులను కారు ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్‌పల్లికి చెందిన ఆసీఫ్ అలీ, మహాలింగపురం గ్రామానికి చెందిన జాఫర్ అలీ(30) శంకర్‌పల్లి నుంచి హైదరాబాద్ వైపు దిచక్రవాహనంలో వెళ్తున్నారు. ఈ క్రమంలో శంకర్‌పల్లిలోని ఎంఎం రెస్టారెంట్ యజమాని మహేశ్ తన కారుతో బైక్‌ను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో గాయపడ్డ యువకులను చికిత్స కోసం నగరంలోని కాంటినెంటల్ ఆస్పత్రికి శుక్రవారం తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ జాఫర్ అలీ ఆదివారం మృతి చెందాడు. ఆసీఫ్ అలీ చికిత్స పొందుతున్నాడని సీఐ వినాయకరెడ్డి తెలిపారు.

భార్య కళ్లెదుటే భర్త మృతి

మృతుడు నేపాల్‌కు చెందిన వ్యక్తి

ఇబ్రహీంపట్నం రూరల్: రోడ్డు ప్రమాదంలో భార్య కళ్లెదుటే భర్త మృతి చెందాడు. ఈ ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. సీఐ రఘువీర్ రెడ్డి కథనం ప్రకారం.. పూజా సౌద్, కపీల్ సౌద్ భార్యభర్తలు. నేపాల్ నుంచి బాలాపూర్ మండలం కమ్మగూడకు వలస వచ్చారు. ఆదిబట్లలోని టీసీఎస్ ఎదుట ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నడుపుకుంటూ జీవనం సాగిస్తారు. ఆదివారం భార్యభర్తలు బైక్‌పై తుర్కయంజాల్ నుంచి కమ్మగూడకు వస్తుండగా క్రిస్టియన్ స్మశాన వాటిక వద్ద క్రేన్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అదుపు తప్పి ఇద్దరు కిందపడ్డారు. భర్త కపీల్ సౌద్ తలపై నుంచి క్రేన్ టైర్ వెళ్లింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి

కొత్తూరు: అనారోగ్యంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ శివారులో ఉన్న జేపీ దర్గా వ్యాపార సముదాయాల వద్ద చోటుచేసుకుంది. కొన్ని రోజులుగా కొత్తూరులో 55 ఏళ్ల వయస్సున్న ఓ వ్యక్తి భిక్షాటన చేస్తూ రాత్రిళ్లు దుకాణాల ముందు ఆశ్రయం పొందుతున్నాడు. అతను అనారోగ్యంతో ఆదివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు స్థానికులు గుర్తించి.. పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ శంకర్‌రెడ్డి తెలిపారు.

పల్లె దారులకు మంచి రోజులు

- గ్రామీణ రహదారులకు మహర్దశ
- బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.46.22 కోట్లు
- నిధులు విడుదల చేసిన పంచాయతీరాజ్‌శాఖ



షాద్‌నగర్: గ్రామీణ రోడ్లకు మహర్దశ కలుగనుంది. ఇప్పటికీ మారుమూల గ్రామాలు, తండాలు, పలు గ్రామ పంచాయతీల్లో రహదారులు లేక స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మట్టి, కంకర రోడ్లే దిక్కవుతున్నాయి. అధ్వానంగా ఉన్న రోడ్లను బీటీ రోడ్లుగా మార్చేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఇందులో భాగంగా నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో 34 కిలోమీటర్ల మేర బీటీ రోడ్లను నిర్మించనున్నారు. ప్రభుత్వం రూ.46.22 కోట్లు మంజూరు చేసింది.

నిధులు మంజూరు

నియోజకవర్గంలో నందిగామ, కేశంపేట, ఫరూఖ్‌నగర్, కొందుర్గు, జిల్లేడు చౌదరిగూడ మండలాల్లోని 18 గ్రామాల్లో బీటీ రోడ్ల నిర్మాణానికి రాష్ట్ర పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ శాఖ రూ.46.22కోట్లు మంజూరు చేసింది. నందిగామ మండల పరిధిలోని రంగాపూర్ నుంచి పెంజర్ల వరకు 1.80 కిలోమీటర్ల దూరానికి రూ.2కోట్ల 15లక్షలు, కేశంపేట మండలం నిర్దవెల్లి నుంచి లింగంధన గ్రామం వరకు 4.5 కిలోమీటర్ల దూరానికి రూ.5.30కోట్లు, ఇప్పలపల్లి నుంచి శేరిగూడ వరకు 2.05 కిలోమీటర్లకు గాను రూ.2.44కోట్లు, ఫరూఖ్‌నగర్ మండలంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి పీర్లగూడ వరకు 2కిలోమీటర్ల దూరానికి రూ.2.25కోట్లు, కొందుర్గు మండలంలో రేగడిచిల్కమర్రి నుంచి కంకల్ వరకు 2.50 కిలోమీటర్లకు గాను రూ.2.80కోట్లు, పర్వతాపూర్ నుంచి కొందుర్గు - నవాబ్‌పేట రోడ్డు వరకు 2కిలోమీటర్లకు రూ.2.22కోట్లు, పాత ఆగిర్యాల నుంచి చించోడ్ వరకు 3.70కిలోమీటర్లకు గాను రూ.4.15కోట్లు, జిల్లేడు చౌదరిగూడ మండలంలో పెద్ద ఎల్కిచర్ల గ్రామం నుంచి ముజాహిద్‌పూర్ వరకు 3.50కిలోమీటర్లకు రూ. 3.85కోట్లు, ఫరూఖ్‌నగర్ మండలంలో చించోడ్ నుంచి వెంకట్‌రెడ్డిపల్లి వరకు 2.50కిలోమీటర్లకు గాను రూ.2.95కోట్లు, కేశంపేట మండలం సంతాపూర్ నుంచి లేమామిడి పీఆర్ రోడ్డు వయా రామలింగేశ్వరస్వామి ఆలయం వరకు 2.65 కిలోమీటర్లకు గాను రూ.3.14కోట్లు, ఫరూఖ్‌నగర్‌లో కొండన్నగూడ నుంచి నాట్కో పరిశ్రమ వరకు 2కిలోమీటర్లకు రూ.2.30కోట్లు, కొందుర్గులో రేగడిచిల్కమర్రి నుంచి పీఆర్ రోడ్డు చింతలపల్లి వరకు 1.50 కిలోమీటర్లకు రూ.1.80కోట్లు, కేశంపేటలో పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి వేములనర్వ ఎస్సీ కాలనీ వరకు 1.25కిలోమీటర్లకు రూ.1.49 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది.

త్వరలో పనులు ప్రారంభం

నియోజకవర్గంలోని 18 గ్రామాల మీదుగా 34 కిలోమీటర్ల మేర నిర్మించే బీటీ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.46.22 కోట్లు మంజూరు చేసింది. ఈ పనులు చేపట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

రహదారులకు పెద్ద పీట



గ్రామీణ ప్రాంత రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. నియోజకవర్గంలో 34 కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మించేందుకు ప్రభుత్వం రూ.46.22కోట్లు మంజూరు చేసింది. రోడ్ల నిర్మాణంతో ప్రజలకు ఎంతో సౌకర్యం వంతంగా ఉంటుంది.

– అంజయ్య యాదవ్, ఎమ్మెల్యే, షాద్‌నగర్

తండ్రి మందలించాడని కొడుకు పరార్

ఇబ్రహీంపట్నం రూరల్: పనికి వెళ్లలేదని కుమారుడిని తండ్రి మందలించడంతో ఇంట్లో నుంచి పారిపోయాడు. ఈ ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. అర్కపల్లి జంగయ్య అనే వ్యక్తి మన్నెగూడలో నివాసం ఉంటున్నాడు. ఇతనికి ఇద్దరు పిల్లలు. ఆరు నెలలుగా పనికి వెళ్లకుండా కుమారుడు యాదగిరి ఇంట్లోనే ఉంటున్నాడు. దీంతో ఈ నెల 4వ తేదీన యాదగిరిని మందలించాడు. అప్పటి నుంచి కనిపించకుండా పోయాడు. కుమారుడి ఆచూకి తెలియకపోవడంతో తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొనివిచారణ చేస్తున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్ పాలనలోనే ప్రజలకు న్యాయం



కసిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

'గ్యారంటీ'తో పూర్వ వైభవం

- ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి
- పార్టీలో భారీగా చేరికలు

ఆమనగల్లు: కాంగ్రెస్ పార్టీ పాలనలోనే ప్రజలకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజల మద్దతుతో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో ఆదివారం ఆమనగల్లు, మాడ్గుల మండలాల నుంచి వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు కసిరెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైనప్పటికీ ప్రజలు న్యాయం జరుగలేదని విమర్శించారు. ఆరు గ్యారంటీ స్కీంలతో ప్రజలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, యువవికాసం, చేయూత పథకాలు అమలు జరిగితే ప్రజలు అన్ని రకాలుగా లబ్ధిదారులు అభివృద్ధి చెందుతారని పేర్కొన్నారు. ఆరు గ్యారంటీలతో పార్టీకి పూర్వవైభవం వస్తుందని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాడ్గుల జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, ఆమనగల్లు ఎంపీపీ అనిత విజయ్, నాయకులు కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

మాడ్గుల ఉపసర్పంచ్ రాములు, పల్లె జంగయ్య, వార్డు సభ్యులు తిరుపతయ్య, యాదయ్య, మల్లేశ్‌యాదవ్, నాయకులు కంచర్లగిరి, పర్వతాలుయాదవ్, మల్లేశ్ తదితరులు హస్తం గూటికి వచ్చారు. అలాగే ఆమనగల్లు మండలం పోలెపల్లి గ్రామానికి చెందిన పలువురు నాయకులు ఎంపీపీ అనిత కాంగ్రెస్‌లో చేరారు.

సావిత్రి బాయి పూలే విగ్రహావిష్కరణ



సావిత్రి బాయి పూలే విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: శేరిగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యాకమిటీ చైర్మన్ సురేందర్‌తో కలిసి సావిత్రి బాయి పూలే విగ్రహాన్ని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. సావిత్రిబాయిని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్రవంతి, ఎంపీపీ కృపేశ్, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెంకటరమణారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ భరత్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్రం



సమావేశంలో మాట్లాడుతున్న అంజయ్య తదితరులు

యాచారం: కేంద్ర ప్రభుత్వం ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య విమర్శించారు. యాచారం మండల కేంద్రంలో ఆదివారం వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం, ఉపాధి హామీ చట్టం అమలుకు భారీగా నిధులు తగ్గించిందని ఆరోపించారు. నిధుల తగ్గింపుతో కూలీలకు ఉపాధి లభించే అవకాశమే లేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి వ్యతిరేకంగా చట్టాలు తెస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యురాలు పుష్ప, జిల్లా కార్యదర్శి జగన్, నాయకులు జంగయ్య, ఇందిరమ్మ, రాములు తదితరులు పాల్గొన్నారు.

బాతును చంపిన యువకులపై కేసు

ఎయిర్‌గన్ స్వాధీనం

పహాడీషరీఫ్: ఎయిర్‌గన్‌తో బాతును చంపిన వ్యక్తులపై పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. జల్‌పల్లి గ్రామ శివారులోని హుస్సేన్ ఫాం హౌస్‌లో వాచ్‌మెన్ అహ్మద్ బాతులు, చిలుకలను పెంచుతున్నాడు. ఆదివారం ఉదయం 7.30 గంటల సమయంలో ఫలక్‌నుమాకు చెందిన మహ్మద్ ఫహద్(27), రక్షాపురంకు చెందిన మహ్మద్ అజ్మలుద్దీన్ (35) ఫాంహౌస్‌లోకి వచ్చి ఎయిర్‌గన్‌తో షూటింగ్ ప్రాక్టీస్ చేసుకుంటామని అడిగారు. ఈ క్రమంలోనే రోటిక్స్ ఆర్ఎం-8 ఎయిర్‌గన్‌తో బాతును షూట్ చేసి చంపేశారు. ఇది గమనించిన వాచ్‌మెన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. ఎయిర్‌గన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

పీవీ ఎక్స్ ప్రెస్ వేపై రోడ్డు ప్రమాదం

ఇద్దరికి గాయాలు

రాజేంద్రనగర్: పీవీ ఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వే పై అతివేగంగా వచ్చిన కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొట్టిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. రాజేంద్రనగర్ పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. ఆదివారం కారులో మెహదీపట్నం నుంచి శంషాబాద్ వెళ్తున్న ఇద్దరు మైనర్లు కారును నియంత్రించలేక 198 పిల్లర్ వద్ద డివైడర్ ను ఢీ కొట్టి ముందు వెళ్తున్న మరో కారు ను ఢీ కొట్టారు. ఈ ఘటనలో ముందు వెళ్తున్న కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

కస్టమ్స్ సుంకం ఎగ్గొట్టే యత్నం

- ప్రయాణికుడి నుంచి 13 యాపిల్ ఫోన్లు స్వాధీనం

శంషాబాద్: కస్టమ్స్ సుంకం ఎగ్గొట్టేందుకు ఓ ప్రయాణికుడు చేసిన ప్రయత్నం విఫలమైంది. వివరాలు ఇలా ఉన్నాయి.. హైదరాబాద్‌కు చెందిన రాజశేఖర్‌రెడ్డి అనే వ్యక్తి బ్యాంకాక్ నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నాడు. తనిఖీలు పూర్తి చేసుకుని అరైవల్ బయట ఉన్న విలేజ్ టెర్మినల్‌లోకి చేరుకున్న తర్వాత తన తోటి ప్రయాణికుల నుంచి ఫోన్లు సేకరించాడు. దీనిని గుర్తించిన నిఘా అధికారులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. కస్టమ్స్ సుంకం చెల్లించకుండా ఉండేందుకు తాను బ్యాంకాక్‌లో కొనుగోలు చేసిన 13 యాపిల్ ఫోన్లను అదే విమానంలో వచ్చిన సహచర ప్రయాణికులకు ఒక్కొక్కటి అందజేసి వాటిని ఇక్కడ తీసుకున్నట్లు తెలిపాడు. కస్టమ్స్ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విదేశీ కరెన్సీతో ...

అక్రమంగా తీసుకెళుతున్న విదేశీ కరెన్సీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మహ్మద్ ఆరీఫ్ హుస్సేన్ అనే వ్యక్తి కొలంబో వెళ్లేందుకు డిపార్చర్ వద్దకు చేరుకున్నారు. తనిఖీల్లో భాగంగా అతడి వద్ద యూఎస్ డాలర్లతో పాటు థాయ్‌బాట్స్ బయటపడ్డాయి. భారత కరెన్సీలో వాటి విలువ రూ. 10.30 లక్షలు ఉండుందని అధికారులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



స్వాధీనం చేసుకున్న ఫోన్లు

తనను దూరం పెడుతోందని..

- భార్యను హత్య చేసిన భర్త
- నిందితుడి అరెస్ట్



నిందితుడు బాలకోటయ్య

నాగోలు: ఆస్తి మొత్తం తన పేరున రిజిస్ట్రేషన్ చేయించుకుని, తనను దూరం పెడుతూ ఇతరులతో సన్నిహితంగా ఉంటుందని భార్యపై కోపం పెంచుకుని ఆమెను బండరాయితో మోది హత్య చేసిన కేసులో నిందితుడిని వనస్థలిపురం పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ వివరాలు వెల్లడించారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మునగనూర్‌కు చెందిన బాల కోటయ్యకు 2008 లో శాలినితో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు. కొద్ది రోజులుగా వారు ఇంజాపూర్ గ్రామం, అంజనాపురికాలనీ నివాసం ఉంటున్నారు. కాగా గత కొంత కాలంగా భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఇరువర్గాల పెద్దలు పంచాయతీ చేసి వారికి సర్ది చెప్పారు. అయినా బాలకోటయ్య భార్యను శారీరకంగా వేధించేవాడు. దీంతో ఆమె జూలై నెలలో ఇద్దరు కుమారులతో కలిసి వనస్థలిపురం శతవాహననగర్‌లో ఉంటున్న తల్లిదండ్రుల వద్దకు వెళ్లి.. అక్కడే ఉంటూ పిల్లలను చదివించుకుంటోంది. తనను దూరం పెట్టి, పిల్లలను తన వద్దకు రానివ్వడం లేదని, ఆస్తులు ఆమె పేరునే రిజిస్ట్రేషన్ చేసుకుందని కోపం పెంచుకున్న బాలకోటయ్య భార్యను హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. కొద్ది రోజుల క్రితం శాలిని తల్లిదండ్రులు వారి సొంతూరికి వెళ్లడంతో అదే అదనుగా భావించి.. ఈ నెల 6న సాయంత్రం శాలిని స్కూటీపై వస్తుండగా విజయపురి కాలనీలోని సాయిబాబ గుడి సమీపంలో ఆమెను అడ్డుకుని దాడి చేశాడు. ఆమె బైక్ పైనుంచి కింద పడగానే పక్కనే ఉన్న బండ రాయితో తలపై మోది హత్య చేసి పరారయ్యాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన వనస్థలిపురం పోలీసులు ఆదివారం సూర్యాపేట టౌన్ బస్ స్టాప్‌లో నిందితుడిని అరెస్టు చేశారు. అతడి నుంచి బైక్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో వనస్థలిపురం సీఐ జలేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.